సాక్షి
నిర్మల్
ఆదివారం । 28 । మే । 2023



కాలంతో పోటీ.. అర్లి(టి) 8లో▸

వేసవిలో అత్యధిక.. శీతాకాలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం అర్లి(టి) గ్రామ ప్రత్యేకత. వానాకాలంలోనూ వర్షపాతం కూడా అధికంగా నమోదవుతోంది.



రైతు చైతన్య సదస్సులేవి?

సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఏటా ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు చైతన్య సదస్సుల జాడ జిల్లాలో మూడేళ్లుగా పత్తా లేకుండా పోయింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
40.5 /28.8

వాతావరణం

భానుడి ప్రతాపం కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు కనిపిస్తాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత పెరుగుతుంది. అక్కడక్కడా చినుకులు పడొచ్చు.

న్యూస్‌రీల్

గడువులోగా పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్ 4న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్న నేపథ్యంలో శనివారం ఎస్పీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. భవనం ఆవరణలో జరుగుతున్న సుందరీకరణ, గార్డెనింగ్, హెలిప్యాడ్ తదితర పనులు పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే రూట్‌మ్యాప్, సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

సారంగపూర్(నిర్మల్): రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించి రసాయన ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఘన జీవామృతం తయారీ, సేంద్రియ ఎరువుల వినియోగం, డాబాలపై కూరగాయల సాగు, కిచెన్ గార్డెన్ నిర్వాహణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దిగుబడులు పెంచుకోవాలని మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగిస్తున్నారని, దీనివల్ల మృత్తిక సారం కోల్పోయి కొన్నాళ్లకు అందులో ఏపంటా పండక భూమి వృథాగా మారుతుందన్నారు. సుభాష్ పాలేకర్ విధానం, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొలాంగూడకు నీళ్లొచ్చాయ్



నల్లా నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

కడెం(ఖానాపూర్): కలెక్టర్ వరుణ్‌రెడ్డి దత్తత గ్రామమైన కొలాంగూడకు నల్లా నీళ్లొచ్చాయి. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కొలాంగూడకు మిషన్ భగీరథ నల్లా నీరు రాక, చేతి పంపులు పనిచేయక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామాన్ని దత్తత తీసుకున్న కలెక్టర్ పలుమార్లు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అందులో మొదటగా నీటిని అందించేలా చర్యలు తీసుకున్నారు. కడెం ప్రాజెక్ట్ నుంచి ప్రత్యేకంగా పైపులైన్ ఏర్పాటు చేసి గ్రామానికి నల్లా నీటిని అందిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలో జూన్ 8, 9, 10 తేదీలలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ వంటకాల మీద 20 మంది మహిళలకు శిక్షణ ఇప్పించామని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారు స్టాల్ ఏర్పాటుకు మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫెస్టివల్‌లో చేపల పులుసు, చేపల ఫ్రై, ఫిష్ పకోడీ, ఫిష్ బిర్యాని, ఫిష్ కట్‌లైట్స్, తదితర వంటకాలు జిల్లా వాసులకు అందుబా టులో తెచ్చే విధంగా పది ఫిష్ స్టాల్లను ఏర్పా టు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య 'సిరి'

- 'చిరు' ధాన్యం.. ఆరోగ్య ధనం
- జిల్లాలో సరికొత్త కార్యక్రమం
- చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపం నివారణకు..
- టీచర్లకు వంటల పోటీలు
- చిరుధాన్యాలతో వివిధ రకాల పదార్థాల తయారీ.. ప్రదర్శన
- కార్యక్రమం వెనుక బహుళ ప్రయోజనం

'చిరుధాన్యపు భోజనం చేయండి.. ఆరోగ్య ధనాన్ని సొంతం చేసుకోండి'... 'ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆ మహాభాగ్యాన్ని ప్రసాదించేది చిరు (సిరి) ధాన్యాలే' అంటూ జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. కలెక్టర్ సూచన మేరకు జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలను పరిచయం చేస్తున్నారు. – నిర్మల్‌చైన్‌గేట్

జిల్లా వివరాలు

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	816
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	110
ప్రాజెక్టులు	4
సెక్టార్లు	37
గర్భిణులు	5,924
బాలింతలు	6,516
చిన్నారులు	62,013





వంటకాలను పరిశీలిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు



వివిధ రకాల వంటకాలు

ప్రతి 100 గ్రాముల చిరుధాన్యాల్లో లభించే పోషకాలు

పోషక విలువలు	రాగులు	అరికలు	పరిగలు	కొర్రలు	సామలు	ఊదలు	సజ్జలు	గోధుమలు	వరి
పిండి పదార్థాలు(గ్రా)	72	65.9	70.4	60.9	67.5	65.6	67.5	71.2	78.2
మాంసకృత్తులు(గ్రా)	7.3	8.3	12.5	12.3	7.7	6.2	11.6	11.8	6.8
కొవ్వు(గ్రా)	1.3	1.4	1.1	4.3	4.7	2.2	4.8	2.0	2.7
శక్తి (కేలరీ)	328	309	341	331	307	300	361	348	382
పీచుపదార్థం (గ్రా)	1.5	9.0	2.2	8.0	7.8	10.1	1.5	1.2	0.2
క్యాల్షియం (మి.గ్రా)	34	27	14	31	17	20	42	41	10
ఇనుము(మి.గ్రా)	3.9	0.5	0.8	2.8	9.3	5.0	11.0	3.5	0.7
థైమిన్(మి.గ్రా)	0.59	0.41	0.42	0.3	0.33	0.15	0.38	0.41	0.41
రైబోఫ్లెవిన్(మి.గ్రా)	0.11	0.28	0.19	0.09	0.1	0.09	0.21	0.04	0.1

అవగాహన కల్పిస్తున్నాం



చిరుధాన్యాల ప్రాధాన్యతపై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నాం. టీచర్లకు మిల్లెట్ వంటకాల పోటీలు నిర్వహించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వీటి ద్వారా ఒనగూరే పోషక విలువల గురించి వివరిస్తున్నాం. పోషకలేమి సమస్యలకు చక్కటి పరిష్కారమని చెబుతున్నాం.
– విజయలక్ష్మి, డీడబ్ల్యూఓ

12 సెక్టార్లలో పోటీలు



నిర్మల్ ప్రాజెక్టు పరిధిలోని 12 సెక్టార్లు, ఏడు మండలాల్లో అంగన్‌వాడీ టీచర్లకు వంటల పోటీలు నిర్వహించాం. మహిళలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నిర్మూలనే పోషణ లక్ష్యంగా నిర్వహిస్తున్నాం. ఈ విషయాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాం.
– నాగమణి, సీడీపీవో,నిర్మల్

బాధ్యత పెంచుతుంది



అధికారులు ఇలాంటి టాస్కులు పెట్టడం ద్వారా మాకు వృత్తి పట్ల బాధ్యత పెరుగుతుంది. వంటల పోటీలు నిర్వహించడం ద్వారా కొత్త రకమైన వంటలతో పాటు ఏఏ వంటకాలలో పోషక విలువలు ఉంటాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది.
– కొండాజి స్వరూప, అంగన్‌వాడీ హెల్పర్

చాలా తెలుసుకున్నాం



అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించి ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. చిన్నారులు, మహిళల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియపరిచారు.
– సులోచన, లబ్ధిదారు

చిరుధాన్యాల సంవత్సరంగా 2023

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యపరంగా అందరికీ చిరుధాన్యాలు అవసరమయ్యాయి. దశాబ్దాల పాటు వాటికి దూరమై కోల్పోతున్నవేమిటో గుర్తించి వినియోగం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. భారతదేశం విజ్ఞప్తితో ఐక్యరాజ్య సమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. విశ్వవేదికపై గుర్తింపు సాధిస్తే సరిపోతుందా? ప్రజల్లో అవగాహన పెరగాలని కేంద్రం శాఖల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో తాజాగా కొనసాగుతున్నవి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడాలో మిల్లెట్స్ ప్రాధాన్యం తెలిపే కార్యక్రమాలు. ఇదివరకు సేంద్రియ సాగు, ప్రైవేటుకే పరిమితమైన చిరుధాన్యాల అంశం ప్రభుత్వ పరిధిలోకి రావడంతో ప్రజావసర అంశంగా మారింది.

ఆరోగ్య ప్రయోజనాలు

మనం తీసుకునే ఆహారంలో బియ్యం, గోధుమలు ఎక్కువ పాళ్లు ఉంటాయి. వీటి స్థానంలో పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవడంతో అనేక విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజ, లవణాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. రక్తవృద్ధి, ఎదుగుదల, రోగ నిరోధకశక్తి, జీవక్రియ మెరుగునకు అవసరమైన పోషక విలువలను ఇవి అందిస్తాయి. అందుకే నిత్యం ఒకపూట భోజనంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని.. క్రమంగా వీటి వినియోగం పెంచాలని సూచిస్తున్నారు.

టీచర్లకు వంటల పోటీలు

ఆరోగ్యకరమైన చిరుధాన్యాలపై ప్రజలందరికీ వివరించాలన్న సదుద్దేశంతో కలెక్టర్ వరుణ్ రెడ్డి, డీడబ్ల్యూవో విజయలక్ష్మి వాటి ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటిని తినడం వల్ల కలిగే లాభాలను వివరించేందుకు అంగన్‌వాడీ టీచర్ల చేత వంటల పోటీల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కేంద్రాలు సెక్టార్ల ప్రాజెక్టుల పరిధిలో పోటీలు పూర్తయ్యాయి. ఇందులో గెలుపొందిన వారికి కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు.

సాగుకు అనుకూలం

జీవనశైలిలో మార్పు కారణంగా పట్టణాల్లో చిరుధాన్యాల వినియోగం పెరిగింది. మిల్లెట్స్ వినియోగం ఎక్కువ కావాలంటే స్థానికంగా సాగు పెరగాలి. చీడపీడల బెడద తక్కువ, స్వల్ప నీటి అవసరం వంటి పర్యావరణ హిత మైన పంటలు కావడంతో సాగుకు అనుకూలమని చెబుతున్నారు.

'దశాబ్ది'కి సన్నద్ధం

- ఘనంగా తెలంగాణ అవతరణం
- జూన్ 2 నుంచి ఉత్సవాలు
- 21 రోజుల పాటు కార్యక్రమాలు
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా అధికారులు
- 4న సీఎం చేతుల మీదుగా కలెక్టరేట్ ప్రారంభం



సమీకృత కలెక్టరేట్



నిర్మల్: 'జై తెలంగాణ'.. అంటూ సబ్బండ ప్రజానీకం ఏకమై చేసిన ఎన్నో పోరాటాలు, స్వరాష్ట్రం కోసం ప్రాణాలను విడిచిన ఎంతోమంది అమరుల త్యాగాలు.. నేటికీ సజీవంగానే ఉన్నాయి. వాటన్నింటి ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి పదేళ్లవుతోంది. ఈ సందర్భాన్ని రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు'గా నిర్వహిస్తోంది. మరో దశాబ్దం పాటు తెలంగాణ సాధనోద్యమం ప్రజల్లో నిలిచి ఉండేలా ప్లాన్ చేసింది. వచ్చేనెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి 21 రోజుల పాటు అంటే జూన్ 22 వరకు వరుసగా కార్యక్రమాలు చేపడుతోంది. శాఖలవారీగా వివిధ కార్యక్రమాలు చేపట్టేలా ఉత్సవాలకు రూపకల్పన చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులతో సీఎం కేసీఆర్ ఇదివరకే సమావేశమయ్యారు. జిల్లాలోనూ ఘనంగా నిర్వహించేలా అధికారులు సన్నద్ధమవుతున్నారు.

రోజుకో కార్యక్రమం..

తొలిరోజైన జూన్ 2న జిల్లాలో మంత్రి ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ, దశాబ్ది ఉత్సవ సందేశం ఉంటాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత సాధించిన ప్రగతిని ప్రజలకు సందేశ రూపంలో తెలియపర్చనున్నారు. జూన్ 3 నుంచి శాఖల వారీగా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

ప్రగతిని తెలిపేలా..

దశాబ్ది ఉత్సవాల వెనుక ప్రధాన ఉద్దేశం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన ప్రగతిని తెలియజేయడమే. ఒక్కో శాఖ ఎలాంటి ప్రగతిని సాధించిందన్న విషయాన్ని ఉత్సవాల రూపంలో తెలియజేయనున్నారు. జూన్ 3 న రైతు దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అన్ని రైతు వేదికలలో క్లస్టర్‌ల పరిధిలోని రైతులు సమావేశం కానున్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను వివరించనున్నారు. రైతులందరితో సామూహిక భోజనాలు చేయనున్నారు. 4న సురక్షా దినోత్సవం ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని తెలియజేస్తారు. పోలీస్‌శాఖలో సంస్కరణలను సభలు, కరపత్రాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తారు. పోలీసుల ర్యాలీలు, వారితో సభలు నిర్వహిస్తారు. ఇలా 22వరకు రోజుకో శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. చివరిరోజైన 22న స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరులను సంస్మరించుకునే కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ వేడుకలతో పాటు తెలంగాణకు హరిత హారం, పోడు పట్టాలు, ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టనున్నారు.

ఉత్సవాల్లోనే 'సమీకృతం'..

దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా ప్రత్యేకంగా నిలువనుంది. ఈ ఉత్సవాల్లోనే సమీకృత కలెక్టరేట్ ప్రారంభం కానుంది. మెడికల్ కాలేజీనీ ప్రారంభించనున్నట్లు సమాచారం. అది కూడా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా జరగనుంది. ఈ మేరకు జూన్ 4న జిల్లాకు సీఎం రానున్నారు. ఆరోజు ఉత్సవాలతో పాటు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే అధికార యంత్రాంగం పనుల్లో నిమగ్నమైంది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఇప్పటి నుంచే ఉత్సవాలు, సీఎం కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు.

శాఖల వారీగా..

తేదీ : కార్యక్రమం
02 : ఉత్సవాలు ప్రారంభం
03 : తెలంగాణ రైతు దినోత్సవం
04 : సురక్షా దినోత్సవం
05 : విద్యుత్ విజయోత్సవం
06 : పారిశ్రామిక ప్రగతి ఉత్సవం
07 : సాగునీటి దినోత్సవం
08 : ఊరూరా చెరువుల పండుగ
09 : తెలంగాణ సంక్షేమ సంబురాలు
10 : సుపరిపాలన దినోత్సవం
11 : తెలంగాణ సాహిత్య దినోత్సవం
12 : తెలంగాణ రన్
13 : మహిళా సంక్షేమ దినోత్సవం
14 : వైద్యారోగ్య దినోత్సవం
15 : పల్లెప్రగతి దినోత్సవం
16 : పట్టణ ప్రగతి దినోత్సవం
17 : తెలంగాణ గిరిజనోత్సవం
18 : మంచినీళ్ల పండుగ
19 : హరితోత్సవం
20 : విద్యా దినోత్సవం
21 : ఆధ్యాత్మిక దినోత్సవం
22 : అమరుల సంస్మరణ

నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌కు నయాలుక్

- కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి పచ్చజెండా
- వెల్లడించిన సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



ఆర్టీసీ చైర్మన్‌తో భేటీ అయిన మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి మరో అడుగు ముందుకు పడింది. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ అధికారులు ఈడీఈ వినోద్ కుమార్, సీటీఎం విజయ్ కుమార్, సీసీఈ రాంప్రసాద్, సివిల్ ఇంజనీర్ మహేష్ నిర్మల్‌కు బహుళ అంతస్తుల షాపింగ్ కాంప్లెక్సుతో కూడిన బస్టాండును నిర్మించేందు కు నమూనాను ఓకే చేసినట్లు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు.

రూ.35 కోట్లతో కమర్షియల్ కాంప్లెక్స్

కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంతో నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ నయాలుక్ సంతరించుకోనుంది. రూ.35 కోట్ల నిధులతో అత్యాధునిక హంగులతో, మెరుగైన వసతులతో బస్‌స్టేషన్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్ ప్రత్యేకతలు

- 1.3 ఎకరాల్లో కాంప్లెక్స్ నిర్మాణం
- పార్కింగ్ సదుపాయం కోసం సెల్లార్, జీప్లస్ వన్ నిర్మాణం
- శుభకార్యాలు నిర్వహించేందుకు ప్రత్యేక హాలు
- ప్రయాణికులకోసం 53 స్టాళ్ల ఏర్పాటు
- ప్రయాణికుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్స్, ఎల్సీడీ తెరల ఏర్పాటు
- రాబోయే 10 తరాలకు అడ్వాన్సుగా నిర్మాణం

ఓటరు నమోదుకు మరో అవకాశం

- స్పెషల్ సమ్మరి రివిజన్ షెడ్యూల్ ప్రకటన
- ప్రారంభమైన ఇంటింటి సర్వే
- కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం

భైంసాటౌన్(ముధోల్): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఇందుకుగాను ఎన్నికల సంఘం ఏటా ఓటరు జాబితా సవరణ చేపడుతోంది. కొత్త ఓటర్ల నమోదుతో పాటు చనిపోయిన ఓటర్ల తొలగింపు, చిరునామా, ఇతర మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తోంది. ఈ ఏడాది జనవరి 5న ఓటరు తుది జాబితా ప్రకటించింది. ప్రస్తుతం ఎన్నికల సంవత్సరం నేపథ్యంలో ఓటరు జాబితా సవరణకు మరోమారు అవకాశం కల్పించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద ఇంటింటి సర్వేకు షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 25 నుంచి జూన్ 23 వరకు బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో కొత్తగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు చేయనున్నారు. ఈ మేరకు ఓటరు జాబితా సవరణపై రెవెన్యూ అధికారులు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు.

షెడ్యూల్ ఇలా...

కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, మార్పులు, చేర్పులకుగానూ స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్ ప్రకటించింది. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు ఈ నెల 25 నుంచి జూన్ 23 వరకు ఇంటింటి సర్వే చేపడతారు. జూలై 25 నుంచి 31 వరకు పరిశీలన, ఆగస్టు 2న ముసాయిదా జాబితా విడుదల, 31 వరకు అభ్యంతరాల స్వీకరణ చేపడతారు. సెప్టెంబర్ 22న అభ్యంతరాలపై వివరణ అనంతరం అక్టోబర్ 4న తుదిజాబితా ప్రకటించనున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖానాపూర్	305	1,01,201	1,04,537	13	2,05,751
నిర్మల్	302	1,10,538	1,22,696	14	2,33,248
ముధోల్	311	1,13,251	1,19,092	27	2,32,370
మొత్తం	918	3,24,990	3,46,325	54	6,71,369

ఓటరుగా నమోదు చేసుకోవాలి

స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. బీఎల్‌వోలతో ఇంటింటి సర్వే చేపట్టి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేపడతాం. అక్టోబర్ 25, 2023 నాటికి పద్దెనిమిదేళ్లు నిండినవారు ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌వోలను సంప్రదించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.
– రవికుమార్, ఆర్డీవో, భైంసా

క్లుప్తంగా

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

జైనథ్: మండలంలోని భోరజ్ గ్రామానికి చెందిన మంచికంటి శేఖర్ (37) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. శేఖర్ గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో గొడవలు జరిగేవి. భార్య, అతడి తల్లి ఎంత చెప్పినా వినకుండా తాగుతూనే ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తాగి వచ్చాడు. మత్తులో ఇంటి తలుపును గుద్దుకోవడంతో కంటి పైభాగంలో గాయమైంది. దీంతో భార్య, తల్లి మందలించడంతో ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. జీవితంపై విరక్తితో చేనులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

గాంధీఆస్పత్రిలో మండల వాసి మృతి


కుడిమెత మధు(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని రాంజీగోండ్‌నగర్‌కు చెందిన కుడిమెత మధు మెదడులో రక్తం గడ్డకట్టడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఐదు రోజుల క్రితం ఆపరేషన్ చేయించినప్పటికీ శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీబాయి, ఇద్దరు సంతానం ఉన్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య


ఆకం కృష్ణ (ఫైల్)

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన అంకం కృష్ణ (23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణ స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. పంటకోసం అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టగా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలని తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘన్‌పూర్ గ్రామ సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న ప్రొఫెసర్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామాన్ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, యూనివర్సిటీ విద్యార్థులు అఖిల్, పావని, అనుష బృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతంలోని ప్రధాన మంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సర్పంచ్ పంద్రలత, ఏఈ ఇందల్, డీపీవో ఐటీడీఏ ప్రవీణ్ ఉన్నారు.

కాలంతో పోటీ.. అర్లి(టి)

• సీజనల్ స్పెషల్.. ఈ ఊరు • ఏటా రికార్డుస్థాయి పగటి ఉష్ణోగ్రతలు • శీతాకాలంలోనూ చలి అధికం • భౌగోళిక పరిస్థితులే కారణం

సండే స్పెషల్

సాక్షి, ఆదిలాబాద్ డెస్క్: సీజనల్ స్పెషల్ ఈ ఊరు. జిల్లాలోనే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఇది. వేసవిలో ఉష్ణోగ్రతలు.. శీతాకాలంలోనూ చలి అధికంగా నమోదు కావడం ఇక్కడి ప్రత్యేకత. ఓ సీజన్‌లో గజగజ వణికిస్తూ.. మరో సీజన్‌లో నిప్పుల కుంపటిని తలపించే ఆ ఊరే ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అర్లి(టి).


గ్రామంపై కప్పుకున్న పొగమంచు(ఫైల్)

భౌగోళిక అంశాలే..

భౌగోళికపరంగా ఈ గ్రామం సముద్రమట్టానికి 286 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఇది పూర్తిగా బండ ప్రాంతం. అలాగే ఓ వైపు అటవీ ప్రాంతం మరోవైపు ఎత్తైన ఐదు కొండలు పరుచుకుని ఉన్నాయి. వేసవిలో సూర్య ప్రభావంతో వేడెక్కిన గుట్టలతో ఉష్ణోగ్రత పెరిగి గరిష్ఠంగా నమోదవుతుంటుంది. ఇక చలికాలంలో శీతల గాలులు, మంచు ప్రభావం కొండల సరిహద్దుకే పరిమితం అవడంతో ఈ ప్రాంతంపై అధిక ప్రభావం చూపుతోంది. దీంతో స్థానికులను చలి వణికిస్తుంది. అలాగే వర్షాకాలంలోనూ అటవీప్రాంతం, కొండల ప్రభావం, పెన్‌గంగా ప్రవాహం కారణంగా వర్షపాతం కూడా అధికంగానే నమోదవుతుంది.


చలిమంట కాగుతున్న వృద్ధురాలు(ఫైల్)


వేసవిలో మండే ఎండ..


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా అర్లి(టి)

ఇక సమ్మర్‌లో ఉదయం ఏడు దాటిందంటే చాలు.. వేడి దడ పుట్టిస్తోంది. రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు న మోదవుతుంటాయి. ఈ ఏడాది ఇప్పటికే 45 డిగ్రీల మార్కుకు చేరువైంది. ఈ సీజన్‌లో చేను పనులు ఉదయం 5 నుంచి మొదలై 10 గంటలకు ముగుస్తా యి. మధ్యాహ్నం గ్రామస్తులు అంతా ఇళ్లలోనే గడుపుతారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తాయి. స్థానికులు చల్లదనం కోసం తొగరి కట్టెలతో పందిరి ఏర్పాటు చేసుకుంటారు.

చలికాలం.. మరో ఊటి

చలికాలం తీవ్రమైన చలి ఉంటుంది. సూర్యోదయ సమయంలో మంచుదుప్పటి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పొగమంచు ప్రభావంతో ఈ ప్రాంతం చూపరులను కనువిందు చేస్తోంది. ఇక్కడ 2021లో రికార్డుస్థాయిలో 3.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ సీజన్‌లో స్థానిక బస్టాప్ వద్ద 24 గంటలు చలిమంటలు ఏర్పాటు చేస్తారు. ఈ సమయంలో ఆవులకు గోనె సంచులతో చేసిన దుస్తులు వేయడం ప్రత్యేకత. చలి నుంచి రక్షణ కోసం స్థానికులకు గొంగళ్లు పంపిణీ చేస్తుంటారు. వేకువజామున కొంచవల్లి దర్గా, రాముల గుట్ట నుంచి చూస్తే మంచుతెరలతో ప్రకృతి కనువిందు చేస్తోంది. డిసెంబర్‌లో ఒక వారంలో సూర్యుడు మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకే అస్తమిస్తాడు. రెండు, మూడు రోజులయితే భానుడు అసలే కనిపించడని స్థానికులు చెబుతుంటారు.


చలికాలంలో కమ్ముకున్న పొగమంచు


చలికాలంలో పశువులపై కప్పిన గన్నీ దుస్తులు (ఫైల్)

గ్రామంలో చలి, ఎండ ఎక్కువ..



మా ఊర్లో చలికాలంలో చలి, ఎండాకాలంలో ఎండ రికార్డుస్థాయిలో ఉంటది. వర్షం కూడా ఎక్కువే. వాతావరణం ఎలా ఉన్నా తట్టుకోవడం అలవాటు చేసుకున్నాం. చలి కాలంలో జాగ్రత్తలు తీసుకుంటాం. చలిమంటల ద్వారా ఉపశమనం పొందుతాం. ఆవులకు గోనెసంచుల దుస్తులు వేస్తాం. ఇప్పుడైతే ఎండదంచి కొడుతుంది. ఇప్పటికే ఎండ 45 డిగ్రీలకు వచ్చిందటున్నరు.

– పిట్ల దేవారెడ్డి, అర్లి(టి) గ్రామం

చుట్టూ రాతి గుట్టల కారణంగానే..



అర్లి(టి)లో భిన్నమైన వాతావరణానికి భౌగోళిక పరిస్థితులే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రామం చుట్టూ ఎత్తైన రాతి గుట్టలు ఉన్నాయి. వేసవిలో ఎండల కారణంగా ఈ గుట్టలు వేడెక్కి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సమీపంలోనే పెన్‌గంగతో పాటు అటవీప్రాంతం ఉండడంతో శీతాకాలంలో చలిసైతం రికార్డుస్థాయిలో నమోదవుతుంది. వర్షపాతం కూడా అధికంగా ఉన్నందున రెయిన్‌గేజ్ ఏర్పాటు చేశాం.

– వెంకటరమణ, సీపీవో, ఆదిలాబాద్

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత


కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన బర్కం రాజశేఖర్ ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబీకులు టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టుటౌన్ సీఐ ఆదేశాల మేరకు గాలింపులు చేపట్టిన పోలీసులు స్థానిక మార్కెట్ యార్డు ప్రాంతంలో తిరుగుతున్న ఆ వ్యక్తిని పట్టుకున్నాడు. టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కి తీసుకువచ్చి కుటుంబీకులకు అప్పగించారు.

నిర్మల్ జిల్లా వాసికి జ్యోతిష్యంలో డాక్టరేట్


డాక్టరేట్ పట్టతో లక్ష్మణ్

తానూరు(ముధోల్): నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని హంగిర్గా గ్రామానికి చెందిన లక్ష్మణ్ అప్పాకు జ్యోతిష్యంలో అస్ట్రాలజీ విభాగంలో డాక్టరేట్ దక్కింది. శనివారం తమిళనాడుకు చెందిన ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టా ప్రదానం చేసినట్లు లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకృషికి ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలోని భీమన్న ఆలయం వద్ద పేకాటాడుతున్న పలువురిని సీఐ షాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేష్ ఆధ్వర్యంలో దాడిచేసి శనివారం పట్టుకున్నారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

టైగర్‌జోన్ కార్యాలయం ఎదుట ముళ్లకంప


కార్యాలయం ఎదుట ముళ్ల కంప వేసి నిరసన తెలుపుతున్న రైతులు

ఇచ్చోడ: టైగర్‌జోన్ పరిధిలో వ్యవసాయ పొలాల్లో బావులు, బోర్లు వేయనియకుండా ఆ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని శనివారం సిరిచెల్మలో టైగర్ జోన్ అటవీశాఖ కార్యాలయం ఎదుట ముళ్ల కంప వేసి రైతులు నిరసన తెలిపారు. కొన్ని రోజులుగా సిరిచెల్మ టైగర్‌జోన్ పరిధిలోని వ్యవసాయ భూముల్లో అటవీశాఖ అధికారులు గిరిజన, గిరిజనేతర రైతుల భూముల్లో బావులు, బోర్లను వేయకుండా అడ్డుకుంటున్నారని నిరసిస్తూ కార్యాలయం ఎదుట అటవీశాఖ అధికారులు రాకుండా ముళ్ల కంప వేసి నిరసన తెలిపారు. పోడుభూములు సాగుచేసుకుంటున్న రైతులను అకారణంగా అధికారులు వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై టైగర్ జోన్ ఎఫ్ఆర్వో వాహబ్ అహ్మద్‌ను వివరణ కోరగా టైగర్ జోన్ పరిధిలో కొంతమంది చట్ట విరుద్ధంగా బావులు, బోర్లు వేసుకుంటున్నారని, ఉన్నతశాఖ అధికారులు ఆదేశాల మేరకు అడ్డుకుంటున్నామని తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకుని కార్యాలయం ఎదుట ముళ్ల కంపను తొలగించారు.

మాలీ కులస్తుల ఎస్టీ హోదాను రాజకీయం చేయవద్దు

• సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: మాలీలది సామాజిక సమస్య అని, దానిని రాజకీయం చేయవద్దని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. గతంలో మాలీలకు ఇచ్చిన హామీ మేరకు మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మాలీ పటేళ్ల సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో పటేళ్ల వ్యవస్థను పటిష్టం చేయబోతున్నామని కొంతమంది కుల ధృవీకరణ పత్రాలు, కల్యాణలక్ష్మి లాంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులు మాలీ సంఘ కులపెద్దల సంతకాలు ఫోర్జరీ చేసి, ఇతర వ్యక్తులు సంతకం చేసి లబ్ధి పొందుతున్నట్లు తెలిసిందన్నారు. జూన్ 5న కలెక్టర్, సంబంధిత తహసీల్దారులను కలిసి మాలీ కుల పెద్దల సంతకాలతో సంబంధించిన వినతి పత్రాలను అందించబోతున్నామన్నారు. కుల పెద్దలు పెట్టిన సంతకాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇతరులు చేసిన సంతకాలను రెవెన్యూ అధికారులు తిరస్కరించాలని కోరానున్నామని పేర్కొన్నారు. దీంతో మాలీ సంఘాన్ని పటిష్టం చేసి ఎస్టీ హోదా సాధించేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా జాప్యం చేయకుండా రానున్న సమావేశాల్లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి మాలీలకు ఎస్టీ హోదా కల్పిస్తూ గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ ఆమోదముద్ర వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు గంగారాం షిండే, జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు అంబేకర్ చంద్రశేఖర్, బరంపూర్(పటేల్) మహాజన్ గురునులే వినోద్, కుచలాపూర్ మహాజన్ శేండే విలాస్, రాంనగర్ మహాజన్ ప్రధాన్ శంకర్, యువజన సంఘాల నేతలు మాందాడే ఉత్తం, తాంసి మహాజన్ గంగారాం చౌదరి పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన


పనుల తీరును అడిగి తెలుసుకుంటున్న అధికారులు

బేల: రూ.1.56కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ) అధికారులు సుబ్రమణ్యం, జాబిర్, భట్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు. పనులు ఆలస్యం, నిర్మాణ గడువు, కాంట్రాక్టర్ అనుభవంపై ఆరా తీశారు. నిర్మాణంలో తక్కువ సిమెంట్, నాసిరకం సామగ్రి వినియోగించొద్దని ఆదేశించారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని, భవనం కనీసం 50ఏళ్ల భవిష్యత్ ఉండేలా చేపట్టాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతగా చేపట్టేలా ప్రతినిత్యం గమనించాలని సర్పంచ్ ఇంద్రశేఖర్‌ను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సతీష్ పవార్, ఠాక్రే మంగేష్ ఉన్నారు.

మల్లాపూర్ చెరువులో మొసళ్లు

• భయాందోళనలో గ్రామస్తులు
• మొసళ్లను పట్టేందుకు నీటిని దిగువకు వదులుతున్న గ్రామస్తులు


మల్లాపూర్ చెరువులో కనిపిస్తున్న మొసలి

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ ఊర చెరువులో రెండు మొసళ్లు కలకలం సృష్టించాయి. రెండు మొసళ్లు చెరువులో సంచరిస్తున్న విషయం తెలియడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రెండు మొసళ్లు చెరువులో సంచరిస్తూ కనిపించడంతో వెంటనే సర్పంచ్ రవి తహసీల్దార్ కవితారెడ్డికి సమాచారం అందజేశారు. దీంతో తహసీల్దార్, డిప్యూటీ ఎఫ్ఆర్వో నజీర్‌ఖాన్ చెరువు వద్దకు చేరుకుని పరిశీలించారు. చెరువులో నీళ్లు ఎక్కువగా ఉండడంతో మొసళ్లను పట్టుకోవడం కష్టం అవుతుందని అటవీశాఖ అధికారులు తెలుపడంతో చెరువులోని నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువు నీటి మట్టం తగ్గిన తరువాత అందులోని మొసళ్లను పట్టుకొని గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

గడువు ముగిసిన కంది విత్తనాలు సీజ్


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో రవీందర్

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలోని విత్తన దుకాణంలో గడువు ముగిసిన కంది విత్తనాలను మండల వ్యవసాయాధికారి రవీందర్ సీజ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సీడ్స్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా అర్లి షాప్‌లో నిల్వ చేసిన గడవు ముగిసిన కంది విత్తన సంచులను గుర్తించారు. 15ప్యాకెట్లలో 30కిలోల విత్తనాలను సీజ్ చేసినట్లు ఏవో తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44లోని పరమాత్మ జిన్నింగ్ మిల్లులో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ ఎస్ఎఫ్‌వో శివాజీ వివరాల ప్రకారం.. ఎండ తీవ్రతతో జిన్నింగ్ మిల్లులోని మిషనరీ బెల్ట్ వేడి కావడంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న పత్తికి అంటుకుంది. దీంతో సుమారు రూ.20వేల విలువ చేసే పత్తి దగ్ధమైనట్లు అంచనా. జిన్నింగ్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఫైర్ సిబ్బంది రవి, దేవేందర్, మధుకర్, తదితరులు ఉన్నారు.

అండమాన్‌లో నిర్మల్ చిన్నారి నృత్యప్రదర్శన



మొమెంట్‌తో సత్కరిస్తున్న నిర్వాహకులు



నృత్య ప్రదర్శన ఇస్తున్న ప్రియదర్శిని

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ చెందిన పడిగెల నవనీత, శ్రీనివాస్ దంపతుల కుమార్తె పడిగెల ప్రియదర్శిని నృత్య ప్రదర్శనలో దూసుకుపోతోంది. ఇప్పటికే పలు రాష్ట్రాలు, దేశాలలో ప్రదర్శనలు ఇచ్చిన ఈ చిన్నారి తాజాగా అండమాన్ నికోబార్ దీవుల్లో తన నృత్య ప్రదర్శనతో అలరించింది. అండమాన్ నికోబార్‌లోని వెంకటేశ్వర టెంపుల్‌లో నిర్వహిస్తున్న శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో ప్రియదర్శిని భారతీయ నృత్య ప్రదర్శనలను చేసి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రియదర్శినిని ఘనంగా సన్మానించారు.



అమ్మవారి సన్నిధిలో 'మహా' నేతలు

భైంసా(ముధోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని శనివారం మహారాష్ట్రకు చెందిన పలువురు నేతలు దర్శించుకున్నారు. మహారాష్ట్ర సీఎం వ్యక్తిగత సహాయకులు బాలాజీ ఖద్గొకర్ కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు రామారావు పటేల్ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు వారికి ఘనస్వాగతం పలికారు. శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.